

కొనసాగుతున్న గజ దాడులు


ఏనుగుల దాడిలో ధ్వంసమైన రాగిపైరు

ప్రజాశక్తి-రామకుప్పం: అటవీ సరిహద్దు ప్రాంతాలనే ఆవాసాలుగా ఎంచుకొని గజరాజులు స్వైరవిహారం చేస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. గురువారం ననియాల తాండాలో రైతు కామరాజునాయక్ చెందిన రాగి పైరు తొక్కి నాశనం చేశాయి. శుక్రవారం రాగి పైరును ధ్వంసమవడాన్ని గుర్తించిన రైతు లబోదిబోమంటూ గుండెలు బాదుకున్నాడు. తరచూ ఏనుగుల దాడులు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

పరిశ్రమ రాకతో పుంగనూరు ముఖ చిత్రం మారనుంది

- యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు
- 800 ఎకరాల్లో రూ.4640కోట్ల పెట్టుబడితో పెప్పర్ మోషన్ పరిశ్రమ
- జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్
- 2024 మార్చిలో పరిశ్రమ నిర్మాణం ప్రారంభిస్తాం
- పరిశ్రమ సీఈవో ఆండ్రియాస్ హేగర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షన్మోహన్

ప్రజాశక్తి-పుంగనూరు: పెప్పర్ మోషన్ ఎలక్ట్రిక్ వాహన తయారీ పరిశ్రమ రాకతో పుంగనూరు ముఖ చిత్రం మారనుందని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం పుంగనూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద పరిశ్రమ సీఈవో బృందంతో కలిసి కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి పరిశ్రమ సీఈవో ఆండ్రియాస్ హేగర్, సీటీవో డాక్టర్ మథియాస్ కెర్లర్, సీఎస్‌వో సత్య, ఫైనాన్స్ డైరెక్టర్ ఉవే స్టెల్టర్, నార్త్ ఎలక్ట్రానిక్ ఇండియా ఎండి హర్షఆద్య, పరిశ్రమ సిఐవో రాజశేఖర్‌రెడ్డి, నల్లపరెడ్డి, సీఎస్‌వో సత్య, సీసీవో రవిశంకర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో అత్యాధునిక టెక్నాలజీతో చిత్తూరు జిల్లా పుంగనూరులో జర్మన్ పెప్పర్ మోషన్ కంపెనీ ఎలక్ట్రిక్ బస్సుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందన్నారు. రూ.4640కోట్ల పెట్టుబడితో 800ఎకరాల్లోమ ప్లాంటు ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చినట్లు వెల్లడించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేశారన్నారు. పరిశ్రమ ఏర్పాటు పూర్తయితే నిరుద్యోగులు బెంగళూరు, చెన్నై నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదని స్థానికంగానే ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సుమారు 8100మంది ఈ పరిశ్రమ ద్వారా ఉద్యోగం పొందొచ్చన్నారు. పరిశ్రమ ఏర్పాటు ద్వారా కాలుష్యం తక్కువ శాతం ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. 2024 ఫిబ్రవరి నెలలో పరిశ్రమ నిర్మాణం ప్రారంభించేలా ప్రణాళికా రూపొందించడం జరిగిందన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు స్థానిక ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు. పెప్పర్ మోషన్ సంస్థ సిఈఓ ఆండ్రియాస్ హేగర్ మాట్లాడుతూ భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. భారతదేశంలో ఉన్న జనాభా కారణంగా రవాణా వ్యవస్థలో అధికంగా బస్సులు, ట్రక్కులను వినియోగించడం జరుగుతోందని, తద్వారా అధిక శాతం కార్బన్ వాయువులు వెలువడతాయని, వీటి ద్వారా వాతావరణం కాలుష్యం అవుతుందని, కాలుష్య నివారణ ప్రధాన అంశంగా తమ స్వంత టెక్నాలజీతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ చేయడం జరుగుతున్నదన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతలను పొందేందుకు సీఎం, జిల్లా కలెక్టర్ అందించిన సహకారం మరువలేనిదన్నారు. 2024 మార్చిలో పనులు ప్రారంభించి 2027కల్లా మూడు దశల్లో నిర్మాణం పూర్తి చేసి 100 ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కుల తయారీని ప్రారంభించేలా చర్యలు చేపడతామన్నారు. పూర్తి ఇంటిగ్రేటెడ్ విధానంలో, పర్యావరణానికి అనుకూలమైన ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్‌ల తయారీకి అవసరమైన అన్ని విడి భాగాలను స్థానికంగా తయారు చేయడం జరుగుతుందని, ఈ వాహనాలను ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేయడం జరుగుతుందన్నారు. పికెయం ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటు సంతోషించతగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో పలమనేరు ఆర్‌డిఓ మనోజ్‌కుమార్‌రెడ్డి, తహసిల్దార్ సీతారాం, ఎంపిడిఓ నాగరాజు, మున్సిపల్ ఛైర్మన్ అలీమ్ భాష, స్టేట్ ఫోక్ అండ్ కల్చరల్ ఛైర్మన్ నాగభూషణం, ఏఎంసీ ఛైర్మన్ నాగరాజురెడ్డి, జడ్పిటిసి జ్ఞానప్రసన్నచంద్రారెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గోపిశెట్టి పల్లి గ్రామానికి అండగా ఉంటాం

- విశ్రాంత డీఎస్పి సుకుమార్


న్యాయ పోరాటం చేద్దామని రైతులతో చర్చిస్తున్న విశ్రాంత డీఎస్పీ

గోపిశెట్టిపల్లి గ్రామ రైతులకు అండగా నిలబడతామని విశ్రాంత డీఎస్పీ సుకుమార్, విఆర్పిఎస్ నాయకుడు అద్దాలు నాగరాజు భరోసా ఇచ్చారు. వాల్మీకి రిజర్వేషన్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామాన్ని సందర్శించి అక్కడ రైతులకి న్యాయం జరిగేలాగా అండగా ఉంటామని చెప్పారు.

పోలీసుల వలయంలో ఇరు గ్రామాలు


గ్రామాల్లో దిగ్బంధించిన పోలీసులు

జపాన్‌కి చెందిన పెప్పర్‌మోషన్ పరిశ్రమ ప్రతినిధులు పుంగనూరుకు వచ్చింది. అయితే వారు రాక ముందే పుంగనూరు మండలంలోని గోపిశెట్టిపల్లి, అమ్మిగానిపల్లి గ్రామాల్లో ముందస్తుగానే పోలీస్ పటాలం దిగిపోయింది. ఇరు గ్రామాలను తమ ఆదీనంలోకి తీసుకున్నారు. గ్రామస్తులను ఎక్కడికక్కడ దిగ్బంధించారు. పరిశ్రమ బృందాన్ని అడ్డుకొనే చర్యలు చేయకూడదని పోలీసుల హెచ్చరికతో రైతులు ఎక్కడికక్కడ చేసేదేమీ లేక గ్రామాల్లోనే ఉండిపోయారు. పోలీసులు మోహరించడంతో ఉదయం నుంచి పొలాలకు కూడా వెల్లలేని పరిస్థితిలో ఉండాల్సి వచ్చిందని గ్రామస్తులు ఆవేధన వ్యక్తం చేశారు. తమకు ఆదరవుగా ఉన్న భూములు వదులుకోవడానికి తాము సిద్ధంగా లేమని, అలాంటి పరిస్థితిలో ఆత్మహత్యలైనా చేసుకుంటామని భూములు ఎట్టి పరిస్థితుల్లో వదులుకోమని రైతులు తేల్చి చెబుతున్నారు.

పరిశ్రమల పేరుతో రైతులకు అన్యాయం చేయొద్దు

- 2013 భూ సేకరణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు


సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గంలో ఎలక్ట్రిక్ బస్సు పరిశ్రమ కోసం చేపడుతున్న 800ఎకరాల భూ సేకరణలో రైతులకు అన్యాయం జరగకుండా 2013 భూ సేకరణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో పరిశ్రమలు రావడాన్ని సీపీఎం స్వాగతిస్తోందన్నారు. అయితే పరిశ్రమ పేరుతో రైతులకు అన్యాయం చేయడం సరైనది కాదన్నారు. పుంగనూరులో పెప్పర్ మోషన్ అతిపెద్ద ఎలక్ట్రిక్ బస్సు ట్రక్ క్లస్టర్ యూనిట్ అతిత్వరలో కంపెనీ పనులు ప్రారంభిస్తున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు, కలెక్టర్ ప్రకటించారన్నారు. పరిశ్రమ ఏర్పాటుతో ఎవరికి ఎలాంటి ఆందోళనలు ఉండవలసిన అవసరం లేదంటున్నారని, కానీ జిల్లాలో ఇప్పటికే కంపెనీ ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూ హక్కుల చట్ట ప్రకారం వారికి డబ్బులు చెల్లించడంలో ఇంకా జాప్యం జరుగుతూనే ఉందన్నారు. ఎవరికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం వారిని ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పే మాటలు ఎలా నమ్మాలని అలాంటి పరిస్థితి పుంగనూరులో రాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. గోపిశెట్టిపల్లి రైతులు ఆందోళన గురవుతున్నారన్నారు. గోపిశెట్టిపల్లి, అమ్మిగానిపల్లిలో మొత్తం 300 మంది రైతులు 400 ఎకరాలు భూములు కోల్పోతున్నారని వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తొలత రైతులకు న్యాయం చేసి ఆ తర్వాత భూసేకరణ చేయాలన్నారు. అలా కాకుండా తర్వాత న్యాయం చేస్తాం అని భూములు తీసుకొని చేయకపోవడం జిల్లాలో అనేక చోట్ల జరిగిందన్నారు. ఆ అనుభవాలను దృష్టిలో పెట్టుకొని రైతులు రకరకాల ఆందోళన గురవుతున్నారు. ఆ గ్రామాల రైతులకు అక్కడ ఉన్న భూమే ఆధారమని వారికి ఎలాంటి ఇతర ఆధారాలు లేవని తెలిపారు. కలెక్టర్ రైతులు ఆందోళన దృష్టిలో పెట్టుకొని 2013 చట్టాన్ని అమలు చేస్తామని చెప్పడం అభినందనీయమని అయితే ఆచరణలో అయ్యే విధంగా చూడాలన్నారు. రైతులకు అన్యాయం జరిగితే సీపీఎం చూస్తూ ఊరుకోదని వారికి అండగా నిలబడుతుందని, రైతులు ఐక్యంగా ఉండి సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేయాలని తెలిపారు.

గిరిజన యువతకు గ్రూప్-2 కోచింగ్ సెంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జిల్లాలో గిరిజన నిరుద్యోగ యువత కోసం గ్రూప్-2కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి మూర్తి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగి ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతకు ఉచిత భోజన, వసతితో కూడిన కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. బయోడేట, విద్యార్హత, కులధ్రువీకరణ పత్రం, రేషనుకార్డు, ఆధారుకార్డు, సంబంధిత ధ్రువీకరణపత్రం నకలులను జిల్లా గిరిజన సంక్షేమ, సాధికార కార్యాలయంలో ఈ నెల 5వ తేదీలోపు సమర్పించాలన్నారు. వివరాలకు సెంటర్ మేనేజరు బాలాజీ, సెల్.నెం. 8187899877కు సంప్రదించాలని కోరారు.

మైనార్టీ సంక్షేమశాఖ అధికారిగా చిన్నారెడ్డి


చిన్నారెడ్డి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా కే.చిన్నారెడ్డిను నియమిస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇంతియాజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం చిన్నారెడ్డి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా అదనపు బాధ్యతల్లో ఉన్నారు.

పౌరుడా మేలుకో.. ఓటు విలువ తెలుసుకో..

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు
- నగరంలో ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం
- వేల మందితో భారీ ర్యాలీ, మానవహారం


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న జెసీ


ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ప్రతి పౌరుడు ఓటు విలువను గుర్తించుకొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ప్రత్యేక ఓటు హక్కు అవగాహన కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ, ర్యాలీ, మానవహారం భారీ ఎత్తున నిర్వహించారు. జాతీయ జెండా చేత పట్టి వేల మంది నినాధాలతో ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ.. నినాధాలు చేశారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని జెసి శ్రీనివాసులు, ఆర్డివో చిన్నయ్య, ఏఈఆర్‌వో కమిషనర్ డాక్టర్ అరుణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసీ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ "సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం" కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొదటిసారి చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, మానవహారం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఇంకా ఓటరుగా నమోదు కాని వారికి అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, తహశీల్దార్‌లు మురళీమోహన్, కిరణ్‌కుమార్, సీఎంఎం గోపి, ఎంఈ గోమతి, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎసీపీ రామకృష్ణుడు, నగరపాలక అధికారులు, ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు, ఎన్సీసీ విద్యార్థులు, నగరంలోని వివిధ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈవీఎంలపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ప్రజలలో ఈవీఎంలపై అవగాహన కల్పించేందుకు ఒక శాతం ఈవీఎంలను రెవెన్యూ డివిజన్ కేంద్రాలకు, మొబైల్ వ్యాన్ ద్వారా అవగాహన కల్పించేందుకు ఉపయోగించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ డిఆర్‌ఓ రాజశేఖర్, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఈవిఎం గోడౌన్‌లో ఈవిఎంలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాకు 1762 ఈవిఎంలు అసెంబ్లీ ఎన్నికలకు సంభందించి ఉన్నాయన్నారు. అందులో 18, మరో 1762 ఈవిఎంలు పార్లమెంట్‌కు సంభందించి ఉన్నాయన్నారు. అందులోంచి 18ఈవిఎంలను ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఉపయోగిస్తామన్నారు. నాలుగు అర్‌డిఓ కార్యాలయాలలో పాటు, మొబైల్ వ్యాన్‌లు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిద పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అన్ని నియోజకవర్గాలలో ఈవీఎంలపై అవగాహన :జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఈవీఎంలపై అవగాహన కల్పించేందుకు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 36 ఈవీఎంలను అవగాహన కోసం ఇవ్వడం జరుగుతోందని నియోజకవర్గ కేంద్రాలలో వీటిని ఉంచాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో అవగాహన కోసం ఈవీఎంలను ఎన్నికల కమిషన్ ఒక పర్సెంట్ రేషియోలో ఇవ్వడం జరిగిందని తెలుపుతూ తగిన జాగ్రత్తల గురించి వివరించారు. నియోజకవర్గ కేంద్రాలలో ఈఆర్‌ఓల పరిధిలో ఈవీఎం యంత్రాలు ఉంచాలని తగిన అధికారులను భద్రతా ఏర్పాట్లు సీసీ కెమెరా మొబైల్ ద్వారా వెళ్ళేటట్లు ఉంటే ఆ వాహనంకు తగిన జాగ్రత్తలు తీసుకొని ఉదయం పంపడం తిరిగి సాయంత్రానికి వచ్చిన తర్వాత సరైన భద్రత కల్పించడం చేయాలన్నారు. ఈవిఎం యంత్రాలు అతి సున్నితమైనవని భద్రత చాలా ముఖ్యమని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తప్పవన్నారు. కార్యాలయంలో అవగాహన కోసం ఈవీఎం కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డిఆర్‌ఓ రాజశేఖర్, నోడల్ అధికారి చంద్రశేఖరనాయుడులు ప్రారంభించారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

విధుల్లో ప్రతిభ కనబరచిన వారిని గుర్తించాలి

- జడ్జి కరుణకుమార్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: విధులలో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించాలని జడ్జి కరుణకుమార్ అన్నారు శుక్రవారం హెచ్ఐవి దినోత్సవం పురస్కరించుకొని మండల ఐసిటిసి కౌన్సిలర్ బాబుకు ఉత్తమ సేవ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విధులు చేపట్టేటప్పుడు నిబంధన పాటించాలని విధులలో ప్రజలకు అత్యంత సేవలు అందించినప్పుడు ప్రభుత్వం వారి సేవలను గుర్తించి అవార్డులను పంపిణీ చేయబడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రభావతిదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కార్యదర్శికి అవార్డు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: వైద్య ఆరోగ్యశాఖ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్థానిక సత్యనారాయణపురం యుపిహెచ్‌సిలోని 29వ వార్డు హెల్త్ సెక్రటరీ అమృత ఉత్తమ ప్రతిభ అవార్డును సొంతం చేసుకున్నారు. ప్రపంచ హెచ్ఐవి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా జడ్జి కరుణ కుమార్, డిఎంహెచ్వో, టీవీ కంట్రోల్ అధికారి చేతుల మీదుగా అమృత అవార్డు, ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.


అవార్డులు అందుకుంటున్న ఐసిటిసి కౌన్సిలర్ బాబు, హెల్త్ కార్యదర్శి అమృత

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


శంఖుస్థాపన కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సూరయ్యగారిపల్లి సచివాలయ భవనం, బోనమందలో ఆర్‌వో ప్లాంటు, ఆవులపల్లిలో రూ.1.10కోట్లు వ్యయంతో నిర్మిస్తున్న సోమేశ్వరాలయంకి శంఖుస్థాపన చేశారు. అదేవిధంగా దుర్గమ్మకొండ మీద జరుగుతున్న ఆలయ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో రోడ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. రక్షిత మంచి నీరు అందించడంలో భాగంగా ప్రతి గ్రామానికి ఓవర్ హెడ్ ట్యాంక్‌కు ఏర్పాటు చేయడం జరుగుతున్నదన్నారు. బొనమంద, బసవపల్లి దగ్గర వంతెన నిర్మాణాలను త్వరలో చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ఆవుల పల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు త్వరలో తీరుతాయని, దీని ద్వారా సోమల, సదుం, పులిచెర్ల, పీలేరు, రొంపిచెర్ల మండలాలకు వ్యవసాయానికి, త్రాగునీటికి సమస్య లేకుండా చూస్తామన్నారు.

'విజిలెన్స్' వేధింపులకు విద్యార్థి బలి: ఎస్ఎఫ్ఐ



విద్యార్థి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని నిరసన

ప్రజాశక్తి - క్యాంపస్ తిరుపతి పట్టణంలోని టిటిడి అనుబంధ ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో బి.కామ్ (సిఎ) చదువుతున్న విద్యార్థి ఎస్.జితేంద్ర కుమార్ మరణానికి కారణమైన విజిలెన్స్ అధికారులు, ప్రిన్సిపాల్ నారాయణమ్మను తక్షణమే అరెస్ట్ చేసి విధుల నుండి తొలగించి మతిపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మాధవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా హాలహర్వి మండలం సిరుగాపురం గ్రామానికి చెందిన జితేంద్ర కుమార్ ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నందు బి.కామ్ (సిఎ) చదువుతున్నాడని, గురువారం రాత్రి హాస్టల్ లో ఉన్న ఫైర్ ఆక్సిడెంట్స్ అత్యవసరాల కోసం ఏర్పాటు చేసిన గ్యాస్ లతో ఆడుకున్నారని అతడిని విజిలెన్స్ అధికారులు చితకబాది అతని దగ్గర నుండి బలవంతంగా క్షమాపణ లేఖ రాయించారని, మనస్థాపం చెందిన విద్యార్థి శుక్రవారం పాకాల రైల్వే స్టేషన్ దగ్గర లో రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విజిలెన్స్ అధికారులు విద్యార్థులను రెగ్యులర్ గా కొడుతున్నారని, ప్రిన్సిపాల్ దష్టి కి తీసుకెళ్లినా ఏ మాత్రం స్పందించడం లేదని, తక్షణమే నారయణమ్మను తొలగించి విచారణ జరిపి విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీవారి మొక్కు తీర్చుకున్న చంద్రబాబు


తిరుమల శ్రీవారి సేవలో చంద్రబాబు దంపతులు

ప్రజాశక్తి - తిరుమల

తెలుగు జాతి ప్రపంచలో నెం. 1 గా ఉండాలని, ఆ సంకల్పంతో పని చేస్తానని టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని చంద్రబాబు నాయుడు దంపతులు దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వామివారి మూలవిరాట్టును దర్శించి, హుండీలు కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు శేషవస్త్రం కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి పాదాల చెంత పుట్టి అంచెలంచెలుగా ఎదిగి ప్రజా సేవకు అంకితమయ్యానని, వెంకటేశ్వర స్వామి తమ ఇంటి దైవమని, ఏ పనైనా ఆయన్ను తలచుకునే ప్రారంభిస్తానని అన్నారు. 2003 శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో అలిపిరి వద్ద తనకు ప్రమాదం జరిగినపుడు తనకు ఆ వెంకటేశ్వర స్వామి ప్రాణ భిక్ష పెట్టారన్నారు. తాజాగా తనకు కష్టం వచ్చినపుడూ వెంకటేశ్వరస్వామిని మొక్కుకున్నానని, మొదటగా ఆయన దర్శనం చేసుకున్న తర్వాతే మిగతా కార్యక్రమాలు చేపట్టాలని అనుకున్నానన్నారు. కష్ట సమయంలో తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు పనబాక లక్ష్మి, అమరనాథరెడ్డి, తిరుపతి మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ తదితరులు ఉన్నారు.


పశు వైద్యాధికారి

చందన ప్రియకు జాతీయ పురస్కారం


అవార్డు అందుకుంటున్న డాక్టర్ చందన ప్రియ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లి పశు వైద్యాధికారి మారసాని చందన ప్రియ జాతీయ పురస్కారం అందుకున్నారు. విజయవాడ గన్నవరం ఎన్టీఆర్ కళాశాలలో జాతీయ టెక్నికల్ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పశుసంవర్ధన శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సత్యకుమారి చందన ప్రియకు అవార్డు అందజేశారు. రెండు రోజులుగా జరిగిన ఈటెక్నికల్ కాన్ఫరెన్స్ లో దేశవ్యాప్తంగా 231మంది పశు సంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన డాక్టర్ చందన ప్రియ గొర్రెలకు శస్త్ర చికిత్సలు చేయడం, ప్రయోగాత్మకంగా సారాంశం వివరించడంలో ప్రతిభ చూపినందుకు ఈ అవార్డు అందజేసినట్టు ఆమె తెలిపారు. డాక్టర్ చందన ప్రియ మాట్లాడుతూ జాతీయ పురస్కారం రావడం తనకు మరింత బాధ్యతలను పెంచిందన్నారు.

చంద్రబాబును కలిసిన బోయకొండ మాజీ చైర్మన్



ప్రజాశక్తి-చౌడేపల్లి: టిడిపి అధినేత చంద్రబాబును బోయకొండ ఆలయ మాజీ ఛైర్మన్ ఎస్‌కె వెంకట రమణారెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం ఉదయం హైదరాబాబులోని చంద్రబాబు నివాసంలో కలిసి పుంగనూరు రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీవారి ఫోటో ఫ్రేమ్‌ని మాజీ సిఎంకి అందజేసి సత్కరించారు. వెంట ఆయన కుమారుడు రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని 89పెద్దూరు గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం టీడీపీ నేతలు కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు మునస్వామి, ఆనందరెడ్డి, కామరాజునాయక్, గజేంద్ర, సత్తి పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: యూటీఎఫ్ నూతన మండల కార్యవర్గాన్ని సభ్యులు శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా టి.మోహన్, ప్రధాన కార్యదర్శిగా రాజేష్, కోశాధికారిగా శరవణన్, సీపీఎస్ కన్వీనర్‌గా ఓ.నాగరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పిసి బాబు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన కార్యవర్గం సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

- చిత్తూరు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్ సేవలు అభినందనీయమని చిత్తూరు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్ సౌజన్యంతో సుమారు రూ.5లక్షల.50వేలతోనిర్మించిన ఉచిత వాటర్ ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగా నగరంలో త్రాగునీటి ఎద్దడి లేకుండా ప్రజలకు త్రాగునీరు అందించేందుకు వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలం కేటాయించిన నగరపాలక సంస్థ కమిషనర్ అరుణకు, అనుమతించిన వన్ టౌన్ సిఐ విశ్వనాథ్ రెడ్డికి లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జామియా, మక్కా మసీదు కమిటీ ఎంపిక

ప్రజాశక్తి-నగరి: పట్టణంలోని జామియా, మక్కా మసీద్‌లకు నూతన కమిటీ ఎంపిక శుక్రవారం జరిగింది. మతపెద్దల సమక్షంలో జమాత్‌లో అందరికీ ఆమోదయోగ్యమైన సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. జమాత్ సభ్యులు ప్రకటించిన మేరకు జామియా, మక్కా మసీదు కమిటీ అధ్యక్షులుగా ఎఎం హబీబుల్లా, కార్యదర్శిగా విఎ తమీన్, ఉపాధ్యక్షులుగా హాజీ ఎస్‌ఈ అబ్దుల్ రహమాన్, ఉపకార్యదర్శిగా ఎం.అన్వరుద్దీన్, కోశాదికారిగా జి.యూనస్, కార్యనిర్వాహక సభ్యులుగా కెఇ.ఖాజా మొహిద్దీన్, ఎంఎం.నజీర్ అహ్మద్, పిఎం.రఫీ, ఎ.ఖాసిం, ఎం. షాహుల్ హమీద్, ఎం. అమాన్‌లు ఎంపికయ్యారు.

కుశస్థలి రోడ్డు నిర్మాణంపై దృష్టి పెట్టండి : సిపిఐ

ప్రజాశక్తి-నగరి: నగరి కుశస్థలి నది రోడ్డు నిర్మాణంపై దృష్టి పెట్టాలని మంత్రి రోజాని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, పట్టణ కార్యదర్శి వేలన్, బాషాలు డిమాండ్ చేశారు. విన్నవించారు. రోడ్డు పూర్తిగా వర్షాలకు దెబ్బతిని మూడు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టలేదని వాపోయారు. అనేక సార్లు, అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చినా సమస్య పరిష్కారం కాలేదని అసహనం వ్యక్తం చేశారు. మంత్రి ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు సిరా వుద్దీన్, ఏఐటియుసి నాయకులు మణి, అయులు, బాబు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పౌరులందరూ ఓటు హక్కు పొందాలి

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: అర్హత గల ప్రతి పౌరుడు ఓటు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ ఇన్బనాదన్ కోరారు. ఓటరుగా పేరు నమోదు చేసుకోవడం కోసం ఈ నెల 9 వరకు అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్లు విజయ్‌క్రిష్ణ, తులసీరామ్, గణేష్ పాల్గొన్నారు.

'పాల వెల్లువ'తో పాడి రైతులకు ఆర్థికాభివృద్ధి



బంగారుపాళ్యంలో

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: జగనన్న పాలవెల్లువతో పాడి రైతులకు ఆర్థి కాభివృద్ధి కలుగుతుందని పూతల పట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలో ని సంక్రాంతి పల్లెలో బిఎంసియు కేంద్రాన్ని ప్రారంభించారు. పాల సేకరణ అధికారి కన్నయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపిపి అమరావతి, సర్పంచ్ బాలాజి, శ్రీనివాసులు, అమూల్ డైరీ ఇన్‌ఛార్జ్ నవీన్, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, ఏఈ గురవారెడ్డి, ఈవోపీఆర్డీ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న పాల వెల్లువ కార్యక్రమంతో పాడి రైతులకు ఆర్థికభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. శుక్రవారం స్థానిక శివాలయం వీధిలోని పాల వెల్లువ కేంద్రాన్ని సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేషాద్రి, ఎంపీడీవో మోహనమురళి, మహిళలు పాల్గొన్నారు.


రామమందిరం ప్రారంభోత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



ప్రజాశక్తి - ఎద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట పంచాయతీ గుట్టూరులో నూతనంగా నిర్మించిన రామమందిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొన్నారు. రాముల వారికి ప్రత్యేక పూజలో పాల్గొని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డప్ప, మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీ జి.డి.బాబు, రాష్ట్ర హ్యూమన్ రైట్స్ సెల్ అధ్యక్షులు ఎస్.ఆంజప్ప, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు హరినాథ్, సింగల్ విండో చైర్మన్ ఓబుల్‌రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ సురేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.


సమాజ సేవలో ముందుండాలి



ప్రజాశక్తి-చౌడేపల్లి: అందరూ సమాజ సేవా భావంతో ముందుకు నడవాలని ఎన్‌వి ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లోని లద్దిగం వద్ద ప్రజలతో మమేకమైయ్యారు. సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుంటానన్నారు. జామియా మసీదు గదికి భూమిపూజ చేశారు. గ్రామంలోని రామాలయ నిర్మాణానికి ట్రస్ట్ తరపున ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, సందీప్‌రెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, జయపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటరమణరెడ్డి, విరుపాక్షి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపణీలో అలసత్వం వద్దు

- ఎంపీపీ లత



ప్రజాశక్తి-కార్వేటినగరం: బాలింతలు, గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార పంపణీలో అలసత్వం వహించరాదని ఎంపీపీ లత అంగన్వాడీ సిబ్బందికి హితవు పలి కారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించారు. ఎంపీపీ పౌష్టికాహారం అందజేయడంలో లోపాలు లేకుండా చూడాలని సూచించారు. గర్భిణీలకు, బాలింతలకు ప్రభుత్వం అందజేస్తున్న సామాగ్రి వివరాలను సీడీపీవో పద్మసునంద వివరించారు. అంగన్వాడీ కేంద్రంలో కొత్తగా చేరిన విద్యార్థిని ఆశీర్వధించి ఆక్షింతలు వేశారు. అదే విధంగా చాకలివానిగుంట అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు శ్రీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు అన్నప్రాసన్న చేపట్టారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు శామిని, ఇందిరా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీక్షిత్ భారత్ సంకల్పయాత్ర

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లి గ్రామం నందు వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్స్ 72 డాక్టర్ విజయ్ చంద్ర అందజేశారు. ఆరోగ్య పరమైన విషయాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, బాలాజీ, సర్పంచ్ రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులు@ డంపింగ్ యార్డు

- ఏరులైపారుతున్న కర్నాటక సరుకు
- ట్రెటాప్యాకెట్లు, డిస్‌పోసబుల్ గ్లాసులతో నిండిన చెత్తసేకరణ కేంద్రం
- పట్టించుకోని అబ్కారీశాఖ





ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బార్లలో తాగి తొంగుడాల్సిన మందుబాబులు బహిరంగ ప్రదేశాలను స్థావరాలు చేసుకొని పీకలకాడికి తాగేస్తున్నారు. ఆంధ్ర మందు కాదని, కర్నాటక మద్యాన్ని తెచ్చుకొని లాగించేస్తున్నారు. గ్రామాల్లోని డంపింగ్ యార్డులు, బహిరంగ ప్రదేశాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. ఇంత జరుగుతున్నా.. అటువైపు అబ్కారీశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో విమర్శలు గుప్పిస్తున్నాయి. అదేంటి ఆంధ్రాలో కర్నాటక మద్యం నిషేదం కదా అనుకుంటే పొరపాటే.. వచ్చే సరుకు వస్తూనే ఉంటుంది.. తాగే వారు తాగుతూనే ఉంటారు.. కానీ పట్టుబడాల్సిన వారు మాత్రమే పట్టుబడుతారన్నదే మతలబు.

టెట్రాప్యాకెట్లు.. డిస్‌పోజల్ గ్లాసులు.. ఒక్కటి చేసి!

తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి సంపద సష్టించే కేంద్రంలో టెట్రా ప్యాకెట్లు.. డిస్‌పోజల్ గ్లాసులను కలిపి పీకల దాక తాగి ఖాళీ గ్లాసులు, ప్యాకెట్లను డంపింగ్ యార్డులో నింపుతున్నారు. బైరెడ్డిపల్లి మండలంలోని లక్కనపల్లి పంచాయతీ పరిధిలోని యార్డులో మందుబాబుల కార్యకలాపాలు గుర్తించిన స్థానికులు ఔరా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.


..ప్యాకెట్లు ఎలా వస్తున్నాయ్?

నిత్యం కర్నాటక సరిహద్దులను కాపుకాచి దాడులు నిర్వహిస్తూనే ఉన్నారు పోలీసులు. అయినా సరుకు గ్రామాలకు చేరుతూనే ఉంది. పొద్దు కూకితే మందుబాబులు వీరంగం అధికంగా ఉందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అబ్కారీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-నగరి: మండలంలోని మీరాసాహెబ్ పాళెం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో లీలామాధవి, ఎంఈవో శ్రీదేవి శుక్రవారం తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. తరగతి గదిలో విద్యార్థుల వర్క్ బుక్ కరెక్షన్‌ను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు యాకోబు విద్యార్థుల వర్క్ బుక్ కరెక్షన్ చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం మాంగాడు ప్రాథమిక పాఠశాలలోను మధ్యాహ్నభోజనం, వర్క్‌బుక్ కరెక్షన్‌ను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు.

చేపల వలలో చిక్కిన కొండచిలువ



ప్రజాశక్తి-నగరి: పట్టణంలోని రాజీవ్‌నగర్ సాయిబాబా ఆలయం సమీపం ఉన్న చెరువులో జాలర్లు చేపల కోసం వలవేయగా అందులో చేపలతో పాటు కొండచిలువ చిక్కడంతో భయాందోళనకు గురయ్యారు. వలను అక్కడే గట్టుపై పడేసి కార్వేటినగరం ఎఫ్‌ఆర్వో వెంకటసుబ్బయ్యకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు స్నేక్ క్యాచర్ శ్రీకాంత్‌కు సమాచారం అందించగా అతను సంఘటనా స్థలానికి విచ్చేసి వల నుంచి కొండచిలువను బయటకు తీసి అటవీ ప్రాంతంలో తీసుకెళ్లి వదలిపెట్టాడు.

భారతదేశ చరిత్ర, సంస్కృతి గొప్పది

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: భారతదేశ చరిత్ర, సంస్కృతి గొప్పదని హిస్టరీ ఆర్కియాలజి శాఖ అధ్యాపకులు సూర్యనారాయణ అన్నారు. ఎస్‌విపి డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో భారతదేశ చరిత్ర –సంస్కృతిపై ఆంధ్ర విశ్వవిద్యాలయం అధ్యాపకులు అతిథి ఉపన్యాసం ఇచ్చారు. ఎస్‌విపి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి హిస్టరీ ఆర్కియాలజి శాఖ అధ్యాపకులు సూర్యనారాయణ 'భారతదేశ చరిత్ర – సంస్కృతి'పై విద్యార్థులకు ఉపన్యసించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి పూర్వ విద్యార్థి అయిన ఎస్వీయూ హిస్టరీ డిపార్టుమెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ దీనదయాల్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలలిత, జెకెసి కోఆర్డినేటర్ గంగారామ్, తెలుగు విభాగాధిపతి, కళాశాల న్యూస్ రిపోర్టర్ సంక్రాంతి రాజేంద్రుడు, పరంధామ, ఆర్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా నిప్పో ఫౌండేషన్ వేడుకలు

ప్రజాశక్తి -తడ: తడ మండలంలోని నిప్పో కంపెనీలో శుక్రవారం ఘనంగా నిప్పో ఫౌండేషన్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ వ్యవస్థాపకులు పోట్టిపాటి ఓబుల్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఫౌండేషన్ డే వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు వివిధ క్రీడల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన అపోలో వైద్యులు గంగాధర రెడ్డి పరిశ్రమకు చేసిన కృషిని కొనియాడారు. అనంతరం ఆటపాటలతో కార్మికులు, వారి పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రసిడెంట్ శంకర్ రెడ్డి , హెచ్ ఆర్ మేనేజర్ మురళి మోహన్ రావు తో పాటు మ్యాక్చూ నాగరాజు సంతోష్, మోహన్ రామి రెడ్డి పాల్గొన్నారు.

సైనిక్,నవోదయ ప్రవేశ పరీక్షపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక వరదరాజనగర్ లోని విశ్వం టాలెంట్ స్కూల్ లో ఆదివారం ఉదయం 9 గంటలకు సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్ లో 2024 విద్యా సంవత్సరంలో జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షపై ఉచిత అవగహన సదస్సు, నమూనా పరీక్ష నిర్వాహించనున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టరు ఎన్.విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. అవగాహన సదస్సుకు 4వ తరగతి నుండి 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు, వారి తలిదండ్రులు పాల్గొని ఈ పోటీ పరీక్ష వివరాలు, వారి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. పరీక్షలో సీట్లు పొందడానికి మెలుకు వలను, పద్ధతులు వివరిస్తారన్నారు. వివరాలకు 9399976999, 8688888802 నెంబరులకు సంప్ర దించాలన్నారు.

ప్రతి సవాళ్లకు సిఇలు పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి-శ్రీకాళహసి: దేశం ఎదుర్కొనే ప్రతి సవాళ్లకు సివిల్ ఇంజనీర్లు పరిష్కారాలు కనుగొనాలని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ సూచించారు. స్థానిక తిరుపతి ఐఐటీలో శుక్రవారం సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ విభాగం, ప్లాస్టిక్ ఫైబర్ కార్పొరేషన్, స్వాన్ సైంటిఫిక్ ఎల్ఎల్పి ఆధ్వర్యంలో సుస్థిర వ్యర్థజలాల నిర్వహణ–అధునాతన చికిత్స' అనే రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రొఫెసర్లు డాక్టర్ నర్సమ్మ, డాక్టర్ సత్యనారాయణ భారతదేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి, వాటి పరిష్కార మార్గాల గురించి విద్యార్థులకు విశదీకరించిచారు. సివిల్ ఇంజనీరింగ్ లో వాటర్ క్యారెక్టరైజేషన్, వాటర్ రిసోర్స్ రికవరీ, నా నోటెక్నాలజీలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. నిజ జీవితంలో ఈ పద్ధతులు అవలంబించే సమయంలో అనుసరించాల్సిన సాంకేతికతపైపిపి ద్వారా తెలిపారు.

జీవనోపాధి ఆదాయ మార్గాలపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని మహిళ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అకరంపల్లిలోని శ్రీ పద్మావతి మహిళా అభ్యుదయ సంఘం మహిళలకు "మహిళలకు జీవనోపాధి – ఆదాయ మార్గాలు' అంశంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇంపాక్ట్ ఫౌండేషన్ ప్రసిడెంట్ మునిలక్ష్మీ మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏది లేదని అన్నారు. ఆత్మవిశ్వాసం, మనోబలం, శక్తి సామర్థ్యాలు, ప్రత్యేకమైన ఆలోచన విధానం స్త్రీలకే సాధ్యమని అన్నారు. జీవనోపాధికి గల వివిధ మార్గాలను గురించి వివరించారు. ఐసిటి ఫౌండేషన్ రీజినల్ కోఆర్డినేటర్ లోకేశ్వరి మాట్లాడుతూ స్త్రీలు కలిసి, మెలిసి ఐకమత్యంతో ఏ పని చేసిన గొప్పగా రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం అకాడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీలత కిషోరి, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

' దళిత శంఖారావం'కు తరలిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి -కోట : రాష్ట్రంలో నిత్యం దళితులపై జరు గు తున్న దళిత వ్యతిరేక నిర్ణయాలకు నిరసనగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎమ్‌ఎస్ రాజు అధ్యక్షతన డిపిఆర్ కళ్యాణ మండపంలో చేపట్టిన దళితుల శంఖారావం సభకు కోట మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుమూరు మురళి, సీనియర్ నాయకులు మద్రి పోలయ్య, కోట మండల ఉపాధ్యక్షులు మద్రి అనిల్ ఆధ్వర్యంలో కోట మండల ఎస్సీ నాయకులు, కొత్తపాలెం ఎంపిటీసీ నారాయణ, తిరుపతి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి ఇన్నమాల అనోక్, కర్లపూడి కోటేశ్వరరావు, కుదురు శ్రీహరి, పెంచలయ్య, ఏడుకొండలు టిడిపి కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లారు.

గూడూరు రూరల్ : దళిత శంఖారావం కార్యక్రమానికి గూడూరు నియోజక వర్గ పరిధిలోని టిడిపి దళిత విభాగం నాయకులు వాహనా ల్లో గూడూరు పట్టణం నుండి నెల్లూరు కు బయలుదేరి వెళ్లారు. వైసిపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం టిడిపి ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, అమానుష సంఘటనలు రాష్ట్ర ప్రజలకు తెలిపే విధంగా దళిత శంఖారావంను పార్టీ చేపట్టిందని తెలిపారు. దళితులకు సంబంధించి 27 సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం రద్దుచేసి దళితులకు ఎంతో మోసం చేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేద్దాం

- జిల్లా జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు అందరూ కలసికట్టుగా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి చేపట్టిన ర్యాలీ చర్చి రోడ్డు మీదుగా గాంధీ విగ్రహం



చిత్తూరులో ర్యాలీలో పాల్గొన్న జెసీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు

వరకు సాగింది. చిత్తూరు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, నగర మేయర్ అముద, డిఎంహెచ్‌వో ప్రభావతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజం మొత్తం హెచ్ఐవి నివారణకు నాయకత్వం వహించాలన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ ఎయిడ్స్ నివారణకు కృషి చేయాలన్నారు. మేయర్ మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. డిఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతిదేవి మాట్లాడుతూ వ్యాధి సోకే మార్గాలు, నివారణ చర్యలను వివరించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబి అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో హెచ్ఐవి /ఎయిడ్స్ యొక్క గణాంకాలను తెలియపరిచి ఈ వ్యాధి నివారణకు కృషి చేయాలన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ సోకే మార్గాలు, ప్రభుత్వం అందించే ఉచిత సేవా సౌకర్యాలు గురించి నినాదాలు చేశారు. మహాత్మా గాంధీజీ విగ్రహం వద్ద మానవహారం ఏర్పడి ఆరోగ్య విద్యాధికారి గుణశేఖర్ ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ అనంతరం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్ నందు జిల్లా జడ్జి కరుణ్ కుమార్ అధ్యక్షత వహించి ఈ వ్యాధి సోకిన వారి పట్ల న్యాయపరమైన చట్టంలోని అంశాలను తెలియజేశారు. ఇందులో వివిధ అధికారులు హెచ్ఐవి /ఎయిడ్స్ పై విపులీకరించారు. కార్యక్రమంలో నగరంలోని వివిధ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ డిగ్రీ జూనియర్ కాలేజ్ విద్యార్థులు, అధికారులు, అనధికారులు, ఎన్జీవోలు, ప్రజలు పాల్గొన్నారు.

చౌడేపల్లి: ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేపట్టి మానవహారం నిర్వహించారు. ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హెచ్‌డిఎస్ ఛైర్మన్ కళ్యాణ్ భరత్ అన్నారు. వైద్యాధికారి పవన్‌కుమార్, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ యశోదమ్మ, ఎన్ఎస్ఎస్ బాలాజీ, అధికారులు రేణుక, లత తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురం: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్ఆర్‌పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి పోలీస్ స్టేషన్ వరకు అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. డాక్టర్ సందీప్ రాజ్, డాక్టర్ గిరిధర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది గంగాదేవి పాల్గొన్నారు.

సోమల: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సోమలలో వైద్య సిబ్బంది ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక బృందం ర్యాలీ నిర్వహించి బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు చేశారు.

చిత్తూరుఅర్బన్: హెచ్ఐవి పట్ల అవగాహన పెంచుకోవాలని యశ్వంత్ రూరల్ సొసైటీ ఛైర్మన్, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివద్ధి కమిటీ కార్యదర్శి భారతి తెలిపారు. ప్రపంచ హెచ్ఐవి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గాంధీ విగ్రహం వద్ద విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రామకుప్పం: మండలంలోని విజలాపురం, వీర్నమల, మండల కేంద్రంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం ప్రాథమిక ఆసుపత్రి వైద్య సిబ్బంది ఘనంగా నిర్వహించారు. శుక్రవారం విజలాపురంలోని విద్యార్థిని విద్యార్థులు మానవహారంగా బజారు వీధిలో ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ లోకేష్, రాజకుమార్, కీర్తి,వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నగరి: హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాప్తి తగ్గలేదని, ఎయిడ్స్ రహిత సమాజాన్ని ఏర్పరడచం ప్రతి ఒక్కరి బాధ్యతని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం ఎయిడ్స్‌డేను పురస్కరించుకొని కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ విభాగాలు సంయుక్తంగా అవగాహన కార్యక్రమం, ర్యాలీని నిర్వహించాయి.

బంగారుపాళ్యం: హెచ్ఐవిని నిర్మూలిద్దామని తుంబ కుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చంగల్ రాయలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైద్య కేంద్రం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళి, హెచ్ఎం అబ్దుల్ సుభాన్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదుం: ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన అవసరం అని చెరుకువారిపల్లి ప్రభుత్వ వైద్య అధికారి డాక్టర్ గిరీషా అన్నారు. శుక్రవారం సదుం బస్టాండ్ కూడలిలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్‌లతో ఆమె ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉదయ్ భాస్కర్, సూపర్ వైజర్ నీలకంఠ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ రషీద్ దీప, ఆరోగ్య సిబ్బంది హేమలత, సర్తాజ్, నాగారత్నమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరుఅర్బన్: బొమ్మసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రష్మిక మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలు విద్యార్థులు అవగాహన కలిగి, ప్రతి ఒక్కరికి తెలియజెప్పాలని, అలాగే ఎయిడ్స్ వ్యాధి గురించి చర్చించి నివారణ మార్గాలను తెలుసుకోవాలని, ఎయిడ్స్ లేని సమాజాన్ని నిర్మించడం కోసం ప్రతి ఒక్కరు కషి చేయాలని కోరారు. ప్రిన్సిపల్ శరత్ చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీహర్ష, అధ్యాపకులు జ్యోతిర్మయి, ప్రసన్న అమర్, రెడ్డప్ప, ఓబులేష్ పాల్గొన్నారు.

యాదమరి: ఎయిడ్స్ వ్యాధిని తరిమి కొట్టండి ఎయిడ్స్ రోగులను ఆదరించండి అంటూ మండల కేంద్రమైన యాదమరిలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ ఎంపీడీవో శివరాజన్ సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది భారీ ర్యాలీ మానవహారం నిర్వహించారు.

గంగవరం: ఎయిడ్స్ రహిత స్వచ్ఛమైన భారతదేశాన్ని నిర్మించేందుకు ఈ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని మదర్ తేరిసా కళాశాల కరస్పాండెంట్ ఎం.రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం మదర్ తెరిసా విద్యాసంస్థల్లోని ఇంజనీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్ల, ప్రజలకు ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించేందుకు గంగవరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి లహరి చైర్మన్ ఎం.ఆర్.సునీల్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ రెడ్డి,డైరెక్టర్ డాక్టర్ రాజేందర్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అన్నపూర్ణశారద ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల నుంచి వెదురుకుప్పం కూడలి వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మంగళగౌరీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


హెచ్ఐవీ బాధితులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఎయిడ్స్ డే సందర్భంగా హెచ్ఐవీ బాధితులకు దస్తులు, పౌష్టికాహారాన్ని మానవతాదృక్పతంతో ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి పంపిణీ చేశారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలోని ఏఆర్టీ సెంటర్ వద్ద పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న విజయానందరెడ్డి

పేదలందరికీ సంక్షేమ ఫలాలు



బంగారుపాళ్యంలో

ప్రజాశక్తి-కార్వేటినగరం: నిరుపేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని మండల వైసిపి కన్వీనర్ శేఖర్‌రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కొటార్వేడు సచివాలయంలో సర్పంచ్ శీలారాణి, ఎంపీటీసీ విమల ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు లోకనాథరెడ్డి, సర్పంచ్ విజయులురెడ్డి, కందయ్య. విజయ్, చందురాజు, ఎంపీడీవో మోహన మురళీ, ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, కార్యదర్శి వాణి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఎంపీపీ అమరావతి అన్నారు. శుక్రవారం మండలంలోని కట్టప్పగారిపల్లి సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సర్పంచ్ అనసూయ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పిటిసి సోమశేఖర్, ఇంచార్జ్ ఈవోపీఆర్డి దుర్గాప్రసాద్, సచివాలయ కార్యదర్శులు కుమార్, అనిత తదితరులు పాల్గొన్నారు.

నగరి: రాష్ట్రంలో నవరత్నాల సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కావాలని మంత్రి ఆర్కేరోజా సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధి 9వ వార్డు నెత్తం కండ్రిగలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దయానిధి, ధనపాల్‌రెడ్డి, దేవరాజులు, భారతి, రమేష్‌రెడ్డి, బాలన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడ్డ యువకుడు మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: కుటుంబ కలహాలతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని తంబుగాని గ్రామంలో చోటు చేసుకున్నది. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు తంబుగాని పల్లి గ్రామానికి చెందిన చంద్రయ్య కుమారుడు వంశీ(32) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల 26న కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో వెళ్లిపోయాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు రాణిపేట సిఎంసిలో చికిత్స చేయించారు. శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేశామన్నారు.